నాలుగు అవతారాల్లో..

ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'గేమ్‌ఛేంజర్' ఒకటి. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ అనగానే ఈ సినిమాపై ఎనౌన్స్‌మెంట్ నుంచీ అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. సాధారణంగా శంకర్ సినిమాల్లో హీరోల హీరోయిజం పెక్యులర్‌గా ఉంటుంది. అది దొంగ కథ అయితే ఒకలా, ప్రేమికుడైతే ఒకలా, దేశభక్తుడు, సమాజహితం కోరుకునే చైతన్యమూర్తి కథ అయితే ఒక విధంగా... ఏదేమైనా రొటీన్‌గా మాత్రం ఆయన కథలు ఉండవు. త్వరలో రాబోతున్న శంకర్ 'ఇండియన్ 2'చిత్రంలో కమల్‌హాసన్ హీరోయిజం ఎలా ఉంటుందో చెప్పేయొచ్చు. మరి 'గేమ్‌ఛేంజర్' మాటేంటి? అసలు ఈ సినిమాలో రామ్‌చరణ్‌ని ఆయన ఎలా చూపించబోతున్నాడు? అనేది ఇప్పుడు ప్రేక్షకుల్లో మిలియన్ డాలర్ల ప్రశ్న. కథానుగుణంగా ఇందులో చరణ్ నాలుగు రకాలుగా కనిపిస్తారని సమాచారం. దేనికవే భిన్నమైన రూపాలన్న మాట. కథ అలా డిమాండ్ చేసింది మరి. శంకర్ సినిమాల్లో ఫ్లాష్‌బ్యాక్ అనేది ఎప్పుడూ హైలైట్‌గానే ఉంటుంది. 'గేమ్‌ఛేంజర్'లో కూడా ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ అద్భుతంగా ఉంటుందని టాక్. అంతేకాదు పలు అంశాలపై ప్రజలకు అవగాహన పెంచేలా ఈ సినిమా ఉంటుందని చెబుతున్నారు. శంకర్ 'ఒకేఒక్కడు'ని మించే స్థాయి సినిమా అని కొందరంటున్నారు. ఈ చిత్రంలో కైరా అద్వాణీ కథానాయికగా నటిస్తున్నది. దిల్ రాజు ఈ చిత్రానికి నిర్మాత.

నెగెటివ్ పాత్రలో జాన్వీ!

జాన్వీకపూర్ కెరీర్‌లో ఎక్కువగా సక్సెస్‌లు లేకపోయినా...కథాంశాల ఎంపికలో ఆమె అభిరుచి బాగుంటుందని చెబుతారు. ఐదేళ్ల కెరీర్‌లో వినూత్న చిత్రాల్లో భాగమైందీ భామ. 'దేవర' చిత్రంతో ఆమె తెలుగులో అరంగేట్రం చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. కొన్ని మాసాల క్రితం విడుదల చేసిన జాన్వీకపూర్ ఫస్ట్‌లుక్ పోస్టర్ అందరిలో ఆసక్తిని పెంచింది. తాజా సమాచారం ప్రకారం కథాగమనంలో జాన్వీకపూర్ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని, రెండు భిన్న పార్శ్వాలు కలిగిన క్యారెక్టర్‌లో ఆమె కనిపిస్తుందని చెబుతున్నారు. సినిమా ద్వితీయార్థంలో జాన్వీకపూర్ పాత్ర నెగెటివ్ షేడ్స్‌తో సాగుతుందని, ఆమె అలా ఎందుకు మారాల్సి వచ్చిందనే అంశం కథలో కీలకంగా ఉంటుందని అంటున్నారు. తన క్యారెక్టర్‌లోని సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ నచ్చడం వల్లే జాన్వీకపూర్ ఈ సినిమాకు అంగీకరించిందని, దక్షిణాదిలో తన కెరీర్‌కు శుభారంభాన్నిచ్చే చిత్రమవుతుందనే ధీమాతో ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇటీవలే గోవాలో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. త్వరలో కర్ణాటకలో కొత్త షెడ్యూల్‌కు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

వ్యవస్థపై సామాన్యుడి పోరాటం

వెంకటేష్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకుడు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా సోమవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. వెంకటేష్ కెరీర్‌లోనే భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వ్యవస్థలోని అరాచక శక్తులపై ఓ సామాన్యుడి పోరాటం ఏమిటన్నదే ఈ చిత్ర కథాంశమని, వెంకటేష్ పాత్ర పవర్‌ఫుల్‌గా సాగుతుందని చెబుతున్నారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.మణికందన్, సంగీతం: సంతోష్ నారాయణ్, రచన-దర్శకత్వం: శైలేష్ కొలను.

చైతన్యరావు, బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్‌భాస్కర్

మంచి మజా ఇస్తది

'నేను, నాగ్‌అశ్విన్, తరుణ్‌భాస్కర్, సందీప్‌రెడ్డి వంగా వేరే వేరే చోట పెరిగాం. మా నేపథ్యాలు వేరు. మా నలుగురినీ సినిమా కలిపింది. 'పెళ్లిచూపులు' సినిమాతో నన్ను హీరోను చేశాడు తరుణ్‌భాస్కర్. తను నాకెప్పుడూ స్పెషలే' అన్నారు యువహీరో విజయ్ దేవరకొండ. తరుణ్‌భాస్కర్ నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'కీడా కోలా'. బ్రహ్మానందం, రఘురామ్, రవీంద్ర విజయ్, జీవన్‌కుమార్ విష్ణు, చైతన్యరావు మదాడి, రాగ్ మయూర్ ప్రధాన పాత్రధారులు. ప్రముఖ హీరో రానా దగ్గుబాటి సమర్పిస్తున్న ఈ చిత్రానికి కె.వివేక్ సుదాంశు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద నందిరాజ్, ఉపేంద్ర వర్మ నిర్మాతలు. నవంబర్ 3న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి విజయ్ దేవరకొండ అతిథిగా విచ్చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ -' నాగ్‌అశ్విన్ 'ఎవడే సుబ్రమణ్యం' నిర్మాణ సమయంలో తరుణ్‌భాస్కర్ నాకు పరిచయమయ్యాడు. మేం కలిసి చేసిన పెళ్లిచూపులు సినిమాకు తరుణ్‌కి నేషనల్ అవార్డ్ వచ్చింది. అంత సక్సెస్ తర్వాత తను ఏమైనా చేయొచ్చు. కానీ తను నమ్మిందే చేస్తాడు. నచ్చిన స్క్రిప్ట్‌తోనే వెళ్తాడు. తను పరిశ్రమకు దొరికిన అదృష్టం. తరుణ్‌భాస్కర్‌పై నమ్మకంతో చెబుతున్నా. 'కీడాకోలా' కచ్చితంగా మంచి మజానిస్తుంది' అన్నారు. కుర్రాళ్లతో పనిచేయడంవల్ల యంగ్ అనే ఫీలింగ్ వచ్చిందని, నన్ను వీల్‌ఛైర్‌లో కూర్చోబెట్టి కామెడీ చేయించాలనే ఆలోచన తరుణ్‌భాస్కర్‌లోని కొత్తదనానికి నిదర్శనమని బ్రహ్మానందం అన్నారు. బ్రహ్మానందంగారితో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని తరుణ్‌భాస్కర్ చెప్పారు.

అందాల అమ్మాడీ..

యువహీరో నాని, మృణాల్ ఠాకూర్ జంటగా రూపొందుతున్న చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్ దర్శకుడు. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మాతలు. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరాలందించిన ఈ చిత్రం పాటల్లో ఫస్ట్ సింగిల్, సెకండ్ సింగిల్స్‌ని ఇప్పటికే విడుదల చేశారు. అవి మంచి ప్రజాదరణ పొందుతున్నాయని మేకర్స్ చెబుతున్నారు. నవంబర్ 4న ఈ సినిమాకు చెందిన థర్డ్ సింగల్‌ని విడుదల చేయనున్నట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. 'అమ్మాడీ..' అంటూ సాగే ఈ పాట ఓ బ్యూటిఫుల్ రొమాంటిక్ నంబర్ అని, విభిన్నమైన కథాకథనాలతో రూపొందుతోన్న ఈ చిత్రం అన్ని వర్గాలకూ నచ్చుతుందని, మృణాళ్ ఠాకూర్, నాని కెమిస్ట్రీ హైలైట్‌గా నిలుస్తుందని, నాని కుమార్తె పాత్ర పోషించిన బేబీ కియారా ఖన్నా పాత్ర ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ అని మేకర్స్ చెబుతున్నారు. డిసెంబర్ 7న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది.

సురేందర్ రెడ్డి దర్శకత్వంలో..

కెరీర్ ఆరంభంలో పలు తెలుగు చిత్రాల్లో నటించారు అగ్ర హీరో విక్రమ్. అయితే తమిళంలో స్టార్ హీరోగా ఎదిగిన తర్వాత తెలుగులో స్ట్రెయిట్ చిత్రాన్ని చేయలేదు. ఇక్కడ స్ట్రెయిట్ సినిమా చేయాలన్నది తన కల అని చాలా సందర్భాల్లో చెప్పారు విక్రమ్. విశ్వసనీయ సమాచారం ప్రకారం అందుకు ఆయన రంగం సిద్ధం చేశారని తెలిసింది. అగ్ర దర్శకుడు సురేందర్ రెడ్డి నిర్దేశకత్వంలో విక్రమ్ ఓ తెలుగు సినిమాకు ఓకే చెప్పారని అంటున్నారు. యాక్షన్, థ్రిల్లింగ్ అంశాల నేపథ్యంలో సురేందర్ రెడ్డి చెప్పిన కథ బాగా నచ్చడంతో విక్రమ్ వెంటనే అంగీకరించారని చెబుతున్నారు. అయితే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లడానికి రెండేళ్లు పట్టే అవకాశం ఉందని తెలుస్తున్నది. పవన్‌కల్యాణ్‌తో సురేందర్ రెడ్డి ఓ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. అలాగే వెంకటేష్‌తో కూడా ఓ సినిమా కన్‌ఫర్మ్ అయినట్లు సమాచారం. ఈ రెండు చిత్రాలు పూర్తయ్యాకే విక్రమ్ సినిమా పట్టాలెక్కే ఛాన్స్ ఉందంటున్నారు.

వినూత్న ప్రేమకథ

సంతోష్‌శోభన్, అలేఖ్య జంటగా నటిస్తున్న తాజా చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ పతాకాలపై సాయిరాజేష్, ఎస్.కె.ఎన్ నిర్మిస్తున్నారు. సుమత్ పాతూరి దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర హీరో నాగచైతన్య క్లాప్‌నివ్వగా, దర్శకుడు చందు మొండేటి కెమెరా స్విఛాన్ చేశారు. సాయిరాజేష్ మాట్లాడుతూ 'నేను, ఎస్.కె.ఎన్ కలిసి ఆరు ప్రేమకథా చిత్రాలు చేయాలనుకున్నాం. ఇప్పటికే కలర్‌ఫోటో, బేబీ వచ్చాయి. ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో ఓ సినిమా చేస్తున్నాం. మరో రెండు లవ్‌స్టోరీస్ చేస్తాం. గత రెండు చిత్రాల తరహాలోనే విభిన్నమైన ప్రేమ కథ ఇది. అన్ని విభాగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తాం. ఈ కథకు సంతోష్‌శోభన్ చక్కగా కుదిరాడు' అన్నారు. 'బేబీ' వంటి సూపర్‌హిట్‌ను అందించిన టీమ్‌తో కలిసి పని చేయడం ఆనందంగా ఉందని హీరో సంతోష్ శోభన్ అన్నారు. కథానాయికగా నటించాలన్నది తన కల ఈ సినిమాతో నెరవేరిందని అలేఖ్య పేర్కొంది. ఈ కథ విన్నప్పుడే హిట్ పక్కా అనే భావన కలిగిందని నిర్మాత ఎస్.కె.ఎన్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, కథ: సాయిరాజేష్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేష్ పెద్దింటి, దర్శకత్వం: సుమన్ పాతూరి.

కచ్చితంగా భయపెడతాం

శ్రీకాంత్ శ్రీరామ్ , ఖుషీ రవి జంటగా నటిస్తున్న చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉపశీర్షిక. సాయికిరణ్ దైదా దర్శకుడు. యశ్వంత్ దగ్గుమాటి నిర్మాత. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్నది.. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేశారు. ' ఇదొక విభిన్నమైన హారర్ సినిమా. మమ్మల్ని భయపెట్టలేరు అని మనసులో అనుకొని రండి. ఖచ్చితంగా మిమ్మల్ని భయపెడతాం. ఇందులో అనవసరమైన పాటలు, డబుల్‌మీనింగ్ డైలాగులు ఉండవు. కేవలం కంటెంట్‌ని నమ్ముకొని తీసిన సినిమా ఇది' అని శ్రీరామ్ అన్నారు. సినిమా తీయడానికి భయపడుతున్న రోజుల్లో భయపెట్టే సినిమా తీసిన మేకర్స్‌కి నా అభినందనలు. దర్శకుడు సాయికిరణ్‌కి మంచి పేరు తెచ్చే సినిమా ఇది అని కోన వెంకట్ నమ్మకం వ్యక్తం చేశారు. 'యదార్థ సంఘటన ఆధారంగా అల్లిన హారర్ కథ ఇది. సినిమా చూశాక ఈ సినిమాకు 'పిండం' అనే టైటిలే కరెక్ట్ అని అందరూ ఒప్పుకుంటారు. మనిషి ఆరంభం నుంచి అంతం వరకూ ముడిపడి ఉండే టైటిల్ ఇది. అందరి సహకారంతో సినిమా తీయగలిగాను' అని దర్శకుడు చెప్పారు. ఇంకా బీవీఎస్ రవి, శ్రీనివాస్ అవసరాలతో పాటు చిత్ర యూనిట్ సభ్యులు కూడా మాట్లాడారు.

ఆ దీవెన మళ్లీ ఫలిస్తే?

సెప్టెంబర్‌లో దుబాయి వేదికగా సైమా 2023 అవార్డుల ప్రధానోత్సవం జరిగిన సంగతి తెలిసిందే. ఈ వేడుకకు సంబంధించిన వీడియోలు తాజాగా బయటికి వచ్చాయి. అందులో మృణాళ్ ఠాకూర్‌కి సంబంధించిన వీడియో ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఫిలిం క్రిటిక్స్ విభాగంలో 'సీతారామం' సినిమాకు గాను ఉత్తమనటి అవార్డును మృణాళ్ గెలుచుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ' 'సీతారామం' నాకు ప్రత్యేకం. ఎందుకంటే ఉత్తమనటిగా నేను అందుకుంటున్న తొలి అవార్డు ఇది. అందుకే దర్శక, నిర్మాతలకు, తోటి నటీనటులకు థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. అను రాఘవపూడి నాలో తెలుగమ్మాయిని చూశారు. అలాగే తీర్చిదిద్దారు. చివరికి అది ఏ స్థాయికి వెళ్లిందంటే, నేను నిజంగా తెలుగమ్మాయినే అనుకునేంత స్థాయికి. హైదరాబాద్‌ని నా ఊరుగా ఫీలైపోయేదాన్ని. హైదరాబాద్ షిఫ్ట్ అయ్యారా? అంటూ ముంబయ్ నిర్మాతలు ఫోన్లు కూడా చేసేవారు. నిజం చెప్పాలంటే, నిజంగానే హైదరాబాద్ షిఫ్ట్ అవ్వాలనుంది.' అంటూ ఆనందంగా చెప్పింది మృణాళ్. ఇదిలావుండగా.. ఉత్తమనటి అవార్డును మృణాళ్‌కి అందజేసిన నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ ' గతంలో ఓ హీరోయిన్‌ని తెలుగబ్బాయిని పెళ్లి చేసుకొని తెలుగింటి కోడలుగా రా.. అని దీవించాను. ఆ అమ్మాయి నిజంగా తెలుగింటికోడలైపోయింది. ఇప్పుడు నీక్కూడా నా దీవెన. నువ్వుకూడా హైదరాబాద్‌కి షిఫ్టయిపోవాలి' అంటూ చమత్కరించారు. కొంపదీసి అరవింద్ దీవెన మళ్లీ ఫలించి, మృణాళ్ కూడా తెలుగింటి కోడలైపోతే? అంటూ ఈ విషయంపై పలువురు సరదాగా సంభాషించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ వీడియో బాగా వైరల్ అవుతున్నది.

అలాంటి అబ్బాయి కావాలి

నిత్యామీనన్ పెళ్లి.. ఈ అంశం గురించి రెండుమూడేళ్లుగా ఎవరికి తోచినట్టు వాళ్లు రాసుకుంటూనేవున్నారు. కానీ నిత్యా మాత్రం మౌనంగానే ఉండిపోయిందిగానీ పెద్దగా సమాధానాలు చెప్పిన సందర్భాలు తక్కువే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాత్రం పెళ్లిపై తనకున్న అభిప్రాయం గురించి వివరంగా చెప్పింది నిత్య. ' నేను సంస్కృతిని గౌరవిస్తా. సంప్రదాయబద్ధంగా పెరిగిన అమ్మాయిని. నా గురించి ఏమీ తెలీకుండానే పనిగట్టుకొని నాపై కొందరు దారుణమైన రాతలు రాశారు. అప్పుడు నిజంగా బాధపడ్డా. చివరికి నా పెళ్లి విషయంలోనూ చాలా రూమర్లు వచ్చాయి. కొందరైతే పెళ్లి జరిగిపోయిందని కూడా రాసేశారు. ప్రోగ్రామ్స్ కూడా టెలికాస్ట్ చేశారు. వాటిని చూసి ఎంజాయ్ చేశాను తప్ప సీరియస్‌గా తీసుకోలేదు. తీసుకోను కూడా. నిజానికి పెళ్లి అనే అంశంపై నాకు ఖచ్చితమైన అభిప్రాయం ఉంది. స్థిరమైన ఆలోచనలూ ఉన్నాయి. పెళ్లి అనేది స్త్రీపురుషులిద్దరికీ ఆర్థికపరమైన భరోసా ఇవ్వాలనేది కొందరి అభిప్రాయం. నా వరకూ అది అక్కర్లేదు. సామాజిక భద్రత కావాలి. అలాంటి భరోసా ఇచ్చే అబ్బాయి దొరికితే తప్పకుండా చేసుకుంటా' అంటూ మనసును ఆవిష్కరించింది నిత్యామీనన్.

పదిరెట్లు థ్రిల్ ఫీలవుతారు

'ఈ కథ రాసుకున్నప్పుడే సీక్వెల్ చేయాలనుకున్నాం. అంతటి స్పాన్ ఉన్న స్టోరీ ఇది. మొదటి భాగంతో పోల్చితే పదిరెట్లు థ్రిల్ ఫీలవుతారు' అన్నారు డా॥ అనిల్ విశ్వనాథ్. ఆయన దర్శకత్వంలో సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల జంటగా నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. గౌరికృష్ణ నిర్మాత. నవంబర్ 3న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డా॥ అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ 'గుడి అనే కామన్ పాయింట్ తప్పితే 'కార్తికేయ' చిత్రంతో మా సినిమాకు ఎలాంటి సంబంధం లేదు. తొలిభాగం కంటే అనూహ్యమలుపులతో సాగుతుంది. ప్రేక్షకులు ఏమాత్రం ఊహించలేని ఎనిమిది ట్విస్ట్‌లుంటాయి. పతాకఘట్టాలు షాకింగ్‌గా అనిపిస్తాయి. తొలి భాగం ఓటీటీలో విడుదలకావడంతో రెస్పాన్స్ ఏమిటో తెలియలేదు. అయితే సినిమా చూసిన చాలా మంది సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడంతో మా ప్రాజెక్ట్‌పై మంచి హైప్ క్రియేట్ అయింది. నిర్మాత బన్నీవాసుగారికి మా సినిమా నచ్చడంతో ఇంకా పెద్దరేంజ్‌కు వెళ్లిందనుకుంటున్నాం. తాను ఎలాంటి పాత్రనైనా చేయగలనని సత్యం రాజేష్ నిరూపించుకున్నాడు. నిర్మాణపరంగా ఎక్కడా రాజీపడకుండా తెరకెక్కించాం. 'మా ఊరి పొలిమేర-3' కూడా ఉంటుంది. దీనికి సంబంధించిన కథ కూడా సిద్ధంగా ఉంది' అన్నారు.

బ్యాండ్ బాగా మోగుతుంది..

సుహాస్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'. దుష్యంత్ కటికినేని దర్శకత్వంలో జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కామెడీ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం జనవరిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా శేఖర్‌చంద్ర స్వరాలందించిన ఈ సినిమా ఫస్ట్ సింగిల్ 'గుమ్మా..' సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'ఇది కొత్త కథ. ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచే కథ. ఈ సినిమా విషయంలో పూర్తి సంతృప్తితో ఉన్నా. అందరికీ మంచి పేరుతెచ్చే సినిమా అవుతుంది' అని హీరో సుహాస్ అన్నారు. సంగీత పరంగా కూడా సినిమా బావుంటుందని, నిజజీవిత అనుభవాల ఆధారంగా ఈ కథ రాసుకున్నానని దర్శకుడు చెప్పారు. జనవరిలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్‌తోపాటు నిర్మాత ఎస్‌కెఎన్ కూడా పాల్గొన్నారు.